క్లుప్తంగా

ఉపాధి పనులపై సమీక్ష

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామరావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఏఏ గ్రామాల్లో పనులు చేస్తున్నారు, ఎంతమంది కూలీలు హాజరవుతున్నారు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీల వారీగా రికార్డులను పరిశీలించారు. అలాగే మెట్ట భూముల్లో పండ్ల తోటల సాగును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

పరిగి: మండలకేంద్రమైన పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. పాఠశాలలో పని చేసిన గోపాల్, మారుతీ, కొండయ్య, రామ్మోహన్, సతీష్‌లను ప్రధానోపాధ్యాయురాలు కృపాసత్యరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ కేశవరెడ్డి

గుడిబండ: గ్రామీణ, పట్టణ ప్రాంతాలను శుభ్రంగా ఉంచడానికి, పారిశుధ్య పనులను మెరుగు పరచడానికి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ.. సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కేశవరెడ్డి స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రాముఖ్యత, దాని లక్ష్యాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజునాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్లు

సోమందేపల్లి: మండలంలోని కొత్తపల్లి సమీపంలో మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. రొద్దం మండలం నల్లూరు, పెద్దమంతూరు ప్రాంతంలోని నదీ పరివాహన ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఇసుక ట్రాక్టర్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మరమ్మతుకు నిధులు కేటాయించండి



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల మరమ్మతుకు నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని పీడీఎస్‌యూ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలోని సమస్యలు పరిష్కరించాలన్నారు. హాస్టల్‌లో మరుగుదొడ్లకు మరమ్మతు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శులు భగత్, రాజు, నాయకులు అనుదీప్, నాసిర్, ఫణి, నాగేంద్ర, నరసింహ, అరుణ్, అభిలాష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్



న్యాయవాదులతో సమావేశమైన జడ్జి అశోక్‌కుమార్

మడకశిరరూరల్: స్థానిక కోర్టు ఆవరణలో జూలై 5న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అశోక్ కుమార్ సూచించారు. బుధవారం కోర్టు హాల్‌లో లోక్‌అదాలత్‌పై న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కేసులున్న వారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శిథిలావస్థలో పురాతన బావులు

- ముళ్ల పొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగునీటితో నిండిన వైనం
- పట్టించుకోని పురావస్తుశాఖ అధికారులు



అధ్వాన స్థితిలో మంటపాల బావి



పెనుకొండ పట్టణంలో తోటగేరికి వెళ్లే దారిలో శిథిలావస్థలో ఉన్న బావి



దుస్థితికి చేరుకున్న పసరక్కర బావి



పాలక్కరి బావి ఇలా..

పెనుకొండ: పెనుకొండ పట్టణంలో రాజుల కాలంలో నిర్మించిన పురాతన బావులు కాలగర్భంలో కలసిపోతున్నాయి. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన బావులన్నీ నేడు ఆదరణ కరువై చెత్తాచెదారం, ప్లాస్టిక్, ముళ్ల కంపలు, మురుగు నీటితో నిండిపోతున్నాయి. పట్టణంలో పసరక్కర, పాలక్కరి, నాగులబావి, మంటపాల బావి తదితర బావులు విజయనగర రాజుల కాలంలో నిర్మించారు. కొన్నింటిని నాటి రాణులు స్నానమాచరించడానికి వినియోగిస్తే మరి కొన్నింటిని ప్రజల తాగునీటి కోసం నిర్మించారు. అలాగే ఎస్కేడి సర్కిల్లో ఉన్న మంటపాల బావి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల సౌలభ్యం కోసం నిర్మించగా నేడు అది ఉనికి కోల్పోయేస్థితిలో ఉంది.

పట్టించుకని పురావస్తుశాఖ

పెనుకొండలో పురావస్తుశాఖ నిర్లక్ష్యం కారణంగా అనేక కట్టడాలు శిథిలావస్థలో ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగానే బావులు కూడా అంతరించి పోయే పరిస్థితి దాపురించిదంటున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎడాపెడా ఇళ్లు నిర్మిస్తున్నా, ఇతర ఆక్రమణలు జరిగినా పురావస్తు శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదంటున్నారు. పర్యాటక అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలోనూ ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని, అందుకే పెనుకొండలో అనేక పురాతన కట్టడాలు శిథిల దశలోనే మిగిలిపోయాయని చెబుతున్నారు.

బావుల విశిష్టతను కాపాడాలి



పెనుకొండను విజయనగరరాజులు రెండో రాజధానిగా చేసుకుని పాలించారు. వారి హయాంలో నిర్మించిన బావులు నేడు అధ్వాన్నస్థితికి చేరుకుని ప్రాధాన్యత కోల్పోతున్నాయి. కాలగర్భంలో కలసిపోయే పరిస్థితి ఎంతో దూరం లేదు. అధికారులు, పాలకులు తక్షణం స్పందించాలి. బావులను పరిరక్షించి వాటి ప్రాధాన్యతను కాపాడాల్సిన అవసరం వుంది. తద్వారా పర్యాటకానికి ఊతం ఇస్తుందన్న విషయాన్ని గుర్తించాలి.

– భాస్కరరెడ్డి, ఏజీపీ, పెనుకొండ

పాలకులు, అధికారులు స్పందించాలి



పెనుకొండలో రాజుల కాలంలో నిర్మించిన విశాలమైన బావులు వేటికవే ప్రసిద్ధి. పసరక్కరి బావిలో నీళ్లు పచ్చగా, పాలక్కరి బావిలో నీరు తెల్లగా ఉండేవి. రాజులు ఎంతో అమితమైన ప్రేమతో కట్టించిన బావులు ఇవి. వాటిని చూస్తే నాటి రాజరికపు వైభవం పెనుకొండలో ఎలా ఉండేదో తెలుసుకోవచ్చు. వాటి విశిష్టతను కాపాడాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉంది. కేంద్ర నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పర్చాలి.

– మహేష్, పెనుకొండ

బావుల ఉనికిని కాపాడండి



పెనుకొండ పట్టణంలో పురాతన బావుల దుస్థితి చూస్తే బాధగా ఉంది. నాటి కట్టడాలు, పురాతన బావులు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. కేంద్ర నిధులు పెద్ద ఎత్తున తీసుకువచ్చి ప్రతి కట్టడాన్ని అందంగా తీర్చిదిద్ది పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి. పట్టణంలోని పసరక్కరి బావికి ఎంతో పేరుంది. బావులను అభివృద్ధి పరిస్తే పెనుకొండలో పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.

– నేమతుల్లా, పెనుకొండ

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ఎం.లహరి

రొళ్ల: మండల పరిధిలోని అలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసిన ఎం. లహరి ఇడుపులపాయ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. అలుపనపల్లి హెచ్ఎం లత, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



వినతిపత్రం సమర్పిస్తున్న సచివాలయ సిబ్బంది

లేపాక్షి: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్లు లేకుండా, సీనియారిటీ జాబితా విడుదల చేయకుండా, ఖాళీలు చూపకుండా పైరవీలతో ఉద్యోగుల బదిలీలు చేయడంపై సచివాలయ ఉద్యోగులు బుధవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ నాగరాజు, ఏఓ కుళ్లాయప్పలకు వినతి పత్రాలను సమర్పించారు.

రామేశ్వరానికి ప్రత్యేక బస్సు

హిందూపురం: హిందూపురం డిపో నుంచి జూలై 12వ తేదీన రామేశ్వరం యాత్ర స్పెషల్ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలియజేశారు. 12న ఉదయం 7 గంటలకు హిందూపురం నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, శ్రీరంగం, మధురై చివరగా రామేశ్వరం దర్శనం తర్వాత 16న ఉదయం తిరిగి హిందూపురం చేరుకుంటుందన్నారు. టికెట్ల కోసం ఫోన్‌నంబర్ 9440834715కు సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని కల్లురొప్పం గొల్లహట్టిలో మంగళవారం రాత్రి బరుగూరు మారెమ్మకు యాదవ కులస్తుల ఆధ్వర్యంలో జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది ఆశాడ మాసం ప్రారంభం ముందురోజు బరగూరు మారెమ్మకు జ్యోతుల ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు వారి ఇళ్ల నుంచి జ్యోతులు తలపై మోసుకొని ఊరేగింపుగా గ్రామ సమీపాన ఉన్న వేపచెట్టు వద్ద ఏర్పాటు చేసి బరగూరు మారెమ్మ ప్రతిమ వద్దకు చేరుకొని జ్యోతులను సమర్పించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున జంతు బలులు ఇచ్చారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేశారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్నదానం చేశారు.

ఎస్ఎస్‌పీఆర్‌లో సంవిధాన్ హత్యా దివస్

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రగతి అధ్యక్షతన సంవిధాన్ హత్యా దివస్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ నాడు జరిగిన సంఘటనలను గుర్తుంచుకుని భవిష్యత్తులో అలా జరగకుండా ప్రాథమిక హక్కులు, రాజ్యాంగం గురించి తెలుసుకుని చైతన్యం పొందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీలక్ష్మీ, అధ్యాపకులు యశోదాదేవి, శ్రీధర్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డుపై బైఠాయించి నిరసన

హిందూపురం: హిందూపురంలోని చిన్నమార్కెట్ వద్ద బోయపేటకు చెందిన గంగరత్న అనే మహిళా బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. తన తమ్ముడికి డబ్బు ఇచ్చానని, అయితే డబ్బు వాపసు ఇవ్వడం లేదని, దీనిపై వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని గంగరత్న ఆవేదన వ్యక్తం చేశారు. అయితే చిన్నమార్కెట్ వద్ద వాహనాలు నిలిచిపోవడంతో స్థానికులు డీఎస్పీ ఆఫీసు వద్దకు వెళ్లమని సర్దిచెప్పి పంపించివేశారు.

నేటి నుంచి ఉచిత యోగా తరగతులు

మడకశిర: పట్టణంలోని షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం నుంచి పతంజలి యోగ శిక్షణ సమితి ఆధ్వర్యంలో ఉచిత యోగా , ధ్యాన తరగతులు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రోజూ ఉదయం 5.30 నుంచి ఉదయం 7 గంటల వరకూ తరగతులు జరుగుతాయన్నారు.

నేడు అవగాహన ర్యాలీ

రొళ్ల: నియోజకవర్గం కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

29 మంది బెస్కాం ఉద్యోగుల బదిలీ

పావగడ: స్థానిక విద్యుత్‌శాఖ చరిత్రలోనే ఎన్నడు లేని విధంగా ఒకేసారి 29 మంది స్థానిక బెస్కాం ఉద్యోగులు బదిలీ అయ్యారు. గతంలో వారు విధులు నిర్వహించిన స్థానాలకే మళ్లీ బదిలీ కావడం విశేషం. ఇదిలా ఉండగా.. తాలూకాలోని కోటగుడ్డ, లింగదహళ్లి, హులి బెట్ట తండా పరిధిలోని టీసీలు, విద్యుత్ తీగల చోరీలు, సోలార్ పార్క్‌లలోని పాత విద్యుత్ తీగల అవినీతి అక్రమాలు బెంగుళూరు బెస్కాం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఒకేసారి 29 మంది ఉద్యోగులను బదిలీ చేసినట్లు సమాచారం.

సమ్మె పోస్టర్లు విడుదల

సోమందేపల్లి: కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యులు రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం సోమందేపల్లిలోని సీపీఐ కార్యాలయం వద్ద సమ్మెకు సంబంధించిన పోస్టర్లును విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, చాంద్‌బాషా, గంగరాజు, శ్రీకాంత్, ముబారక్ తదితరుల పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

మడకశిర: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఉద్యోగ కల్పన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని వెల్లడించారు. 20 కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరవుతారని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, పీజీ పాసైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు.

నిధుల మంజూరు

అమరాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలురు, బాలికల వసతి గృహాల మరమ్మతుకు నిధులు మంజూరైనట్లు కాంట్రాక్టర్లు బాలు, ఆదినారాయణ తెలిపారు. ఎస్సీ బాలుర వసతి గృహానికి రూ.7.5 లక్షలు, ఎస్సీ బాలికల వసతి గృహానికి రూ.10.4 లక్షలు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. త్వరలోనే పనులు చేపడతామన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

అగళి: వివిధ గ్రామాల్లో ఇప్పటికే సాగు చేసిన పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి మంజునాథ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొడిపల్లి, దాసేగౌడనపల్లి, ఇరిగేపల్లి, నందరాజనపల్లి గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు, సలహాలిచ్చారు.

2న వాహనాల వేలం

మడకశిర: మడకశిర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను జూలై 2న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ మురళికిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. వాహనాల వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు తదితర వాటితో హాజరుకావాలన్నారు. అలాగే నిర్ణయించిన మేరకు ముందుగానే డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

హిందూపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. రూ.4,200 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు.

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

మడకశిర: మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌పై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో హితవు పలికారు. వైఎస్‌జగన్‌కు చెందిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం కక్ష సాధింపు చర్యలో భాగమేనన్నారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ మానుకుని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఎస్ జగన్‌కు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

మాదవ ద్రవ్యాలతో జీవితాలు నాశనం

హిందూపురం టౌన్: మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు విద్యార్థులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని బాలయేసు జూనియర్, డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐతో పాటు సీడీపీఓ సుధావరలక్ష్మీ, సీఐఎఫ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నాగలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మదేవి కరుణించు..

హిందూపురం: పట్టణంలోని సూరప్పకట్ట వద్ద ఉన్న బోయకొండ గంగమ్మదేవి ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. రాత్రి ఆలయ ఆవరణంలో శత్రుసంహారిణీ ప్రత్యాంగిరాదేవి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మదేవి

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: మడకశిర నగర పంచాయతీలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ నూతన కమిటీ సభ్యులకు రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి సూచించారు. ఆయన మడకశిర నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ సభ్యులను బుధవారం ఆయనతో పాటు పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. నగర పంచాయతీ ఉపాధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి మారుతి, కార్యదర్శి చంద్రశేఖర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎంపికకు సహకరించిన సమన్వయకర్త ఈరలక్కప్పకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామన్నారు. మండల కన్వీనర్ రామిరెడ్డి, స్థానిక నాయకులు ధను, నగేష్, నాగభూషణ్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం టౌన్: సామర్థ్యం లేకుండా బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్టీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ అనేక విద్యాసంస్థల వాహనాలకు అద్దాలకు గ్రిల్స్ ఏర్పాటు చేయకుండా బస్సులను నడుపుతున్నారని, దీంతో విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే 60 సంవత్సరాలు పైబడిన వ్యక్తులను డ్రైవర్లుగా నియమించుకోవడంతో వారు వాహనాలను సరిగా అదుపు చేయలేని పరిస్థితి ఉందన్నారు. అలాగే బస్సులో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. అధికారులు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ అఫ్రీద్, ఉమేష్, ఇస్మాయిల్, రజీక్ తదితరులు పాల్గొన్నారు.

అంతా కంపు .. కంపు



అపరిశుభ్రంగా ఉన్న పాత మరుగుదొడ్డి

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని పాతూరు ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లే రహదారిలో ఉన్న పాత మరుగుదొడ్డి అపరిశుభ్రంగా ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. మరుగుదొడ్డి శుభ్రం చేయకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. అటు లేపాక్షి దేవాలయానికి వెళ్లే పర్యాటకులు, ఇటు ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లే భక్తులు అటుగా వెళ్లేలంటేనే ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి. గతంలో మరుగుదొడ్డిగా ఉపయోగపడిన కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో కొందరు బహిరంగ మరుగుదొడ్డిగా ఉపయోగించుకుంటున్నారు. దీన్ని శుభ్రం చూసి అందరికీ అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటికి కట..కట



తాగునీటిని పట్టుకోవడం కోసం వేచి ఉన్న మహిళలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని కొత్తలం గ్రామంలోని వాటర్ స్కీమ్ బోరులో పూర్తిగా నీటి మట్టం తగ్గిపోయిందని కొత్త బోరు వేసి తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామ మహిళలు అధికారులకు విన్నవిస్తున్నారు. వాటర్ స్కీమ్ బోరులో అరకొరగా నీరు వస్తుండంతో బుధవారం మహిళలు ట్యాంకు వద్ద పైపులో పట్టుకోవడానికి గంటల తరబడి వేచి ఉండి నీటిని పట్టుకుంటున్నామని మహిళలు వాపోయారు. రోజు ఇలా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొత్త బోరు వేసి తాగునీటి సమస్యను తీర్చాలన్నారు. గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ బోరులోకి అదనపు పైపులు వదిలినా నీరు అరకొరగా వస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు.

పంటల సాగుకు శ్రీకారం



కొర్రలు విత్తుతున్న రైతులు

అమరాపురం: మండలంలో రెండు రోజుల క్రితం తేలిక పాటి వర్షం కురిసింది. దీంతో కొందరు రైతులు తాము సిద్ధం చేసుకున్న పొలాల్లో వేరుశనగ, కొర్ర తదితర పంటల సాగును ప్రారంభించారు. ఈ పదునుకు విత్తనాలు వేస్తే పంట బాగా వస్తుందని చెబుతున్నారు. మండల కేంద్రమైన అమరాపురం, తమ్మడేపల్లి, దేవగానపల్లి, మద్దనకుంట గ్రామాల్లో రైతులు మెట్ట భూముల్లో విత్తనాలు వేశారు. కాడెద్దులు, ట్రాక్టర్ల సహాయంతో సాగుకు శ్రీకారం చుట్టారు.